క్లుప్తంగా

ఎమ్మెల్సీ సహకారంతో బోరు మోటారు ఏర్పాటు

కొందుర్గు: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సహకారంతో ముట్పూర్ ఉన్నత పాఠశాలలో బోరు వేయించినట్లు గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి తెలిపారు. పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి నవీన్ కుమార్‌రెడ్డి హాజరయ్యారని, ఈ సందర్భంగా విద్యార్థుల కోరిక మేరకు ఆయన బోరు వేయించి, మోటార్ అమర్చి విద్యార్థులకు నీటికొరత లేకుండా చూస్తానని ఇచ్చిన హామీ మేరకు ఆదివారం బోరు వేయించామన్నారు. త్వరలోనే మోటార్ అమర్చి నీటి సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకుడు ప్రభు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేక్ కట్ చేసి, విద్యార్థులకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఖార్గే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా బలపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముసురుకుంది..



అమ్డాపూర్‌లో కురుస్తున్న చిరుజల్లులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో గత మూడు రోజులుగా మబ్బులతో మేఘావృతమై చిరుజల్లులు కురుస్తున్నాయి. ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, చిన్నమంగళారం, నక్కలపల్లి, తోల్‌కట్ట, కనకమామిడి, ఆయా గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడు కనిపించకపోగా కమ్ముకున్న మేఘాలతో చిరుజల్లులు కురుస్తుండడంతో రోడ్లు జలమయమవుతున్నాయి. దీంతో గ్రామాల్లోని ప్రజలు ఎటు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్థికసాయం

కద్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన పిక్లీ అనే మహిళ ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ ఆదివారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీక్యానాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, మాజీ సర్పంచ్ రామునాయక్, తులసీరాం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

ఇబ్రహీంపట్నం రూరల్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.భూపాల్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ సీఐటీయూ కన్వీనర్ తులసీగారి నర్సింహా ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లోని కల్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ నాయకులు ఎం.భూపాల్, కేవీపీఎస్ అధ్యక్షుడు స్కైలాబ్ బాబు విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల పక్షాన నిలబడే సంఘం సీఐటీయూ మాత్రమేనన్నారు. పేదల హక్కుల సాధనే లక్ష్యంగా నిరంతరం పోరాటం చేస్తున్నట్లు వివరించారు. అధ్యక్షుడిగా అనిల్, కార్యదర్శిగా బాబు, ఉపాధ్యక్షుడిగా జగన్, కోశాధికారులుగా ఉపేందర్, సదానందం, సహాయ కార్యదర్శులుగా రమేశ్, కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ.సామేలు, సీపీఎం మండల కార్యదర్శులు చాతాళ్ల జంగయ్య, ఆలంపల్లి నర్సింహా, బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

సాయి దర్శనం.. పోటెత్తిన భక్తజనం

వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



కందుకూరు: ఉత్సవాలకు హాజరైన భక్తులు



కందుకూరు: స్వామి నిఖిలేశ్వరానంద విగ్రహానికి అభిషేకం చేస్తున్న గురూజీ దంపతులు



దర్శనంకోసం బారులు తీరిన జనం



దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆలయంలో బాబాకు అభిషేకం



చైతన్యపురి: పూజల్లో పాల్గొన్న తీగల కృష్ణారెడ్డి



చైతన్యపురి: పూజలు చేస్తున్న బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో గురు పూర్ణిమ మహోత్సవాన్ని ఆదివారం బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి నిఖిలేశ్వరానంద విగ్రహానికి అభిషేకం, పాదుకా పూజలు నిర్వహించారు. భక్తులతో అభిషేకం చేయించారు. అనంతరం గురూజీకి తులాభారం వేసి పూజలు నిర్వహించారు. గురూజీ సాధకులతో ప్రత్యేకంగా సాధనలు చేయించి ప్రవచనాలు చేసి, గురు పూర్ణిమ విశిష్టతను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువు సూచించిన మార్గంలో నడిస్తే భగవంతుడి కృప త్వరగా ప్రాప్తిస్తుందన్నారు. శిష్యులు సన్మార్గంలో నడవాలన్నా, భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నా గురు కృప తప్పక ఉండాలన్నారు. ఆధునిక సమాజంలో ఆటుపోట్లను తట్టుకుని నిలబడాలంటే సాధన ఒక్కటే మంచి మార్గమన్నారు. అనంతరం గురూజీ దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వాదాలు అందించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో గురుపూర్ణిమ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు బాబా దర్శనానికి బారులుతీరారు. సుమారు 60 వేల మందికి పైగా దర్శనం చేసుకున్నట్లు ఆలయ చైర్మన్ శ్యామ్‌కుమార్ తెలిపారు. సాయిట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పోలీస్, జీహెచ్‌ఎంసీ శాఖల సహకారంతో ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సరఫరా, సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, గర్భిణులు దివ్యాంగులు, వీఐపీలు, దాతలకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా బాబా దర్శనం కల్పించామన్నారు. మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి బాబాను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రఘుకుమార్, మాజీ చైర్మన్‌లు గుండమల్లయ్య, వూర నర్సింహాగుప్తా, వనం యాదయ్య, బచ్చు గంగాధర్, కిరణ్ రాజశేఖర్, ఆర్ ఎస్ శంకర్‌రావు, పద్మారావు ఆత్రే పూజల్లో పాల్గొన్నారు.

చంపాపేట: గురు పూర్ణిమను పురస్కరించుకుని రెడ్డి కాలనీలోని సాయిబాబా ఆలయాన్ని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి సందర్శించి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రమణారెడ్డిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, అర్చకులు భీషణ, శ్రీనిధి పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌కాలనీలో..

మన్సూరాబాద్: గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని మన్సూరాబాద్ శ్రీరామ్‌నగర్‌కాలనీలోని షిరిడీ సాయిబాబా దేవాలయం భక్తులతో రద్దీతో సందడిగా మారింది.

ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపించాలి

ఎల్‌బీనగర్: చైతన్యపురిలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనపై విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వంశీ వర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కళాశాల ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కాయకష్టం చేసి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరుకుంటే కార్పొరేటర్ కళాశాల యజమాన్యాలు వారి కష్టంలో వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేవని ప్రభుత్వ నిర్లక్ష్యమే విద్యార్థులకు శాపంగా మారుతుందన్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌కుమార్, వినోద్, బన్నీ, ఉపేందర్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఒత్తిడే కారణం..

కార్పొరేటర్ కళాశాలలో విద్యార్థులపై ఒత్తిడితోనే ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారని అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గుండె శివకుమార్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కార్పొరేటర్ కళాశాలలపై ఫిర్యాదు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఎల్‌బీనగర్ అధ్యక్షులు అరుణ్, కార్యదర్శి స్టాలిన్, నాయకులు నవీన్, ఉదయ్, వంశీ పాల్గొన్నారు.



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మంత్రితో ఎలా శంకుస్థాపన చేయిస్తారు?

బీజేపీ నాయకుల మండిపాటు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు


బడంగ్‌పేట్: రూ.38కోట్ల కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్‌బాబుతో ఎలా శంకుస్థాపన చేయిస్తారని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌కు స్పెషల్ ఫండ్ లేదా అభివృద్ధికి వెచ్చించే ఎమర్జెన్సీ ఫండ్, ఎమ్మెల్యేల కోటా కింద ప్రత్యేక నిధులు తీసుకువచ్చి మంత్రి చేత శంకుస్థాపన చేయిస్తే అందరూ సంతోషించేవాళ్లమని పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధికి ప్రజలు కట్టిన పన్నులతో సాధారణ నిధులు వెచ్చించి శంకుస్థాపన చేయించడం బాధాకరమని వెంకట్‌రెడ్డి వాపోయారు. ఈ విషయంలో మేయర్ కావాలనే ఇతర పార్టీల కార్పొరేటర్లను అవమాన పరిచేవిధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో మేయర్ బీజేపీ కార్పొరేటర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి సభలో ప్రొటోకాల్ అవసరం లేకుండా ఎన్నికల్లో ఓడిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం ఏంటని నిలదీశారు. రానున్నకాలంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేత ఎంపీ నిధులను బడంగ్‌పేట, మీర్‌పేట్ కార్పొరేషన్లకు మంజూరు చేయించి ఎంపీతో పాటు అందెల శ్రీరాములుయాదవ్‌ను స్టేజీ మీదకు ఆహ్వానిస్తామన్నారు. అప్పుడు కూడా కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ రగడ చేయకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏనుగు రాంరెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జోరల ప్రభాకర్, దొడ్డి శ్రీశైలం కురుమ, మాజీ కౌన్సిలర్ ఈరెంకి వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీహోమం



సైదాబాద్: గురు పూర్ణమి పురస్కరించుకొని సైదాబాద్ మాతామైదాన్‌లో కొలువుదీరిన విజయదుర్గా మాతా ఆలయంలో శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంలో ఆలయ కమిటీ ప్రతినిధి సునీల్‌రెడ్డి, సంగీతారెడ్డి పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అవగాహన సదస్సును విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరణ

నాగోలు: కులగణన అవరోధాలు పరిష్కారాలు అంశంపై ఈ నెల 24న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే బీసీబడి సదస్సును విజయవంతం చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు చామకూర రాజు కోరారు. ఆదివారం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఇన్‌చార్జి కేవీ గౌడ్ మాట్లాడుతూ..బిహార్ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపుకోసం కులగణన నిర్వహించి సేకరించిన డాటా ఆధారంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 65 శాతం రిజర్వేషన్లు పెంచారన్నారు. దీనిపై ఓ అగ్రకులానికి చెందిన ఒక వ్యక్తి బిహార్ హైకోర్టు (పాట్నా కోర్టులో) పిల్ వేయగా బిహార్ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన రిజర్వేషన్ల చట్టం అమలు చేయడానికి వీలు లేదని పాట్నా హై కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పుపై పూర్తి విశ్లేషణ ఈ సదస్సులో చర్చిస్తారన్నారు.

'ఐక్యత' సేవలను వినియోగించుకోవాలి

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. వెల్దండ మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్‌హాలులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షల కోసం వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించారు.

లయన్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న కందకూరు లయన్స్ క్లబ్ నిర్వాహకులు

కందుకూరు: కందుకూరు లయన్స్ క్లబ్ తరఫున చేసిన పలు సేవలకు గాను అవార్డులు అందుకున్నారు. సికింద్రాబాద్‌లో శనివారం రాత్రి లయన్స్ క్లబ్ జిల్లా 320ఏ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ హరి నారాయణ్ భట్టడ్, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఏరియా లీడర్ ఎస్.నరేందర్ రెడ్డి, నూతన గవర్నర్ డి.కోటేశ్వరరావు ఉత్తమ సేవలు అందించిన క్లబ్‌లకు అవార్డులు అందించారు. అందులో మధుమేహ నిర్ధారణతో పాటు వివిధ వైద్య శిబిరాలు నిర్వహించినందుకు, మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా పేదలకు అన్నదానం తదితర సేవలకు కందుకూరు క్లబ్ తరఫున జిల్లా మొదటి వైస్ గవర్నర్ డా.జి.మహేంద్రకుమార్‌రెడ్డి, జిల్లా ప్రెస్ కమిటీ సభ్యుడు తాళ్ల అంజయ్య, క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు బీఆర్ రాంరెడ్డి, నూతన అధ్యక్షుడు ఎస్.విఠల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ టి.జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



భక్తులతో రద్దీగా మారిన పోచమ్మ దేవాలయం



రావిర్యాలలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి



మంఖాల్ గ్రామంలో ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో ఆదివారం బోనాల ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుల మధ్య కాలనీలో మహిళలు సంప్రదాయాలకనుగుణంగా తరలివచ్చి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. పోచమ్మ దేవాలయం, దుర్గామాత ఆలయం, ముత్యాలమ్మ ఆలయాలకు మహిళలు ఉదయం నుంచే తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

మహేశ్వరం: పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల నృత్యాలు, కేరింతలతో మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా చేశారు. మండల పరిధిలోని తుక్కుగూడ మున్సిపాలిటీలోని మంఖాల్, తుక్కుగూడ, సర్దార్ నగర్‌లో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణతో పాటు పలు పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలలు అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.

రావిర్యాలలో...

తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో అమ్మవారి బోనాల ఉత్సవాలను భక్తు లు, వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కటికలపల్లి విమలమ్మ-రాములు గౌడ్, వారి కుమారులు భూషణ్ గౌడ్, దేవేందర్ గౌడ్, మహేందర్ గౌడ్, చెన్నయ్య గౌడ్‌లు అమ్మవారి ఘటాన్ని వారి ఇంటి నుంచి ప్రత్యేకంగా అలంకరించి శివ సత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో తరలివచ్చారు.

28న లెనిన్‌నగర్‌లో బోనాల ఉత్సవాలు

మీర్‌పేట: మీర్‌పేట లెనిన్‌నగర్‌లోని కట్టమైసమ్మ, రక్తమైసమ్మ, పోచమ్మ దేవాలయాల చైర్మన్ దిండు రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం కమిటీ సభ్యులు కట్టమైసమ్మ దేవాలయం వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ.. అమ్మవార్ల బోనాల ఉత్సవాలను ఈ నెల 28వ తేదీన జరిపేందుకు కమిటీ నిర్ణయించిందని తెలిపారు. లెనిన్‌నగర్‌తో పాటు పరిసర కాలనీల ప్రజలందరూ వచ్చే ఆదివారమే అమ్మవార్లకు బోనాలు సమర్పించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో కమిటీ సభ్యులు ప్రభు, రవినాయక్, కృష్ణ, స్వామి, మోహన్, భీంరాజ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



కట్టమైసమ్మ దేవాలయం వద్ద సమావేశమైన కమిటీ సభ్యులు

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



ఎమ్మెల్యే సబితారెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



పూజలు చేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో శ్రీ శీతల బొడ్రాయి, నాభీశిలా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఆదివారం వైభవంగా ముగిశాయి. ఉదయం బొడ్రాయికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. గ్రామంలో ఊరి మధ్యలో పూర్వం రెండు బొడ్రాయిలు అప్పటి గ్రామపెద్దలు ప్రతిష్ఠించారు. గ్రామస్తుల సహకారంతో పాత విగ్రహాలను తొలగించి కొత్త బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్ఠించి గ్రామస్తులందరూ బోనాలు సమర్పించారు. బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్‌లతో పలువురు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన అతిథులకు ఉత్సవ కమిటీ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అమీర్‌పేట్ శీతల బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ కమిటీ చైర్మన్ మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, ప్రధాన కార్యదర్శి, మాజీ ఉపసర్పంచ్ చాకలి యాదయ్య, కోశాధికారి ఆవుల అశోక్, గ్రామ పెద్దలు బస్వ పాపయ్య పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న పద్మానాయక్

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి నందనవనంకాలనీ, ఆదర్శ్‌నగర్‌కాలనీ వెనుకవైపు ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్ అన్నారు. సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన ప్రభుత్వ భూమి ఖాళీగా ఉండడంతో కొంత మంది కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆదివారం మండల తహసీల్దార్, ఎక్సైజ్ సీఐ సదరు భూమిని పరిశీలించి సూచిక బోర్డు ఏర్పాటు చేశారు.